# గానకళ

"**క**ళమ్మగారు లేరండీ, రికార్డింగు కెళ్ళినట్టుంది" అన్నది పనిమనిషి.

సినిమా పత్రిక సంపాదకుడూ, ఫొటోగ్రాఫరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

సంపాదకుడు గాన కళను తన మనసులో శపించుకున్నాడు. ఉత్త రిహార్సలేననీ పదింటికల్లా తిరిగి వస్తాననీ అన్నది. ఇప్పుడు పదకొండున్నరయింది.

అతనికి మండిపోయింది.

ప్లేబాక్ పాడేవాళ్ళలో యీవిడగారు యే ఆరో స్థానంలోనో రావచ్చు. ఆరునెల్ల క్రిందట దాకా ఈవిడను ఎవరూ కోరస్‌లు పాడనివ్వలేదు. ఇప్పుడిప్పుడు పడమటి శాంబరంలో కొట్టుకొస్తున్న కొత్త రకం సంగీతం బాగా పట్టుకున్నది. (ఈ సంగీతానికి ఒక జర్నలిస్టు అవాచ్యమైన పేరు పెట్టాడు.)

అంతకన్న ముఖ్యమేమిటంటే గానకళ తొలిసారిగా హీరోయిన్‌కు ప్లేబాక్ పాడుతున్నది. మిగిలిన పత్రికలు పట్టుకునే లోపుగా తానే గానకళను గురించి మంచి స్కెచ్‌లు రాసి బాగా ఫీచర్ చేద్దామని సంపాదకుడి ఉద్దేశం.

"ఆలస్యం కానే అయింది... వెయిట్ చేద్దాం" అన్నాడు సంపాదకుడు.

ఫొటోగ్రాఫర్ తన "రోలీ" పైన వుండే హుడ్ టప్పున తెరచి మళ్ళీ మూశాడు.

❀ ❀ ❀ ❀ ❀

"అనుకోకుండా కాల్‌షీట్ దొరికిందట. రిహార్సల్సుతోపాటు రికార్డింగు కూడా చేశారండీ. ఆలస్యమైంది. క్షమించాలి" అన్నది గానకళ.

సంపాదకుడు ఆమె వెడల్పాటి నోరూ, కంచులో పోసినట్టున్న ముక్కూ చూసి ఆమెను నగ్నంగా వూహించుకొనటానికి ప్రయత్నం చేసి నిరుత్సాహం చెందాడు.

"ఇతే చూడండీ..."

ఇంటర్వ్యూ సాగింది, సంపాదకుడు రాసుకుంటున్నాడు. మధ్యలో కాఫీ తాగారు.

ఫొటోగ్రాఫరు మూడు ఫ్లాష్ ఫొటోలు తీశాడు. ఒకటి గానకళ క్లోజప్, ఇంకొకటి సంపాదకుడికేసి నవ్వుతూ, మూడోది కాఫీ కప్పులతో.

సంపాదకుడు మధ్యలో తలయెత్తి, "మీరు సినిమా ఫీల్డులోకి రావటానికి చేసిన ప్రయత్నాలు, పడిన కష్టాలు వివరించినట్టయితే పాఠకులకు లాభకరంగా వుంటుంది చూడండీ! వాళ్ళ ఉద్దేశం, ఎవరుపడితే వారు అలా సినిమాల్లో చేరి" అన్నాడు.

గానకళ అడ్డొచ్చి "ఎబ్బే సినిమా ఛాన్సుకోసం నేనేమి కష్టపడనే లేదండి. చాలా సులువుగా సంపాదించాను. కొందరు చాలా కష్టపడతారని తెలుసు... నా అదృష్టమనుకుంటాను...." అన్నది, తన అదృష్టానికి తానే ఆశ్చర్యపడుతూన్న దానిలాగా.

"మీకెవరో సహాయం చేసి వుండాలి!"

గానకళ ఆలోచిస్తున్నట్టు మొహం చిట్లించి "సహాయం చాలామంది చేశారనుకోండి. నాకు ఛాన్సులిచ్చే మ్యూజిక్ డైరెక్టర్లందరూ –" అన్నది.

"సినీ ఫీల్డులోకి రావటానికి సహాయం చేసినవారిమాట అడుగుతున్నాను."

"అదా? సీతారామారావుగారని – మీ రెరుగుదురేమో–"

"వెయ్యి కళ్ళు అనే నవల రాసినాయనేనా? మీరాయనను ఎరుగుదురని విన్నాను."

"ఆయనా పట్నంలోనే ఉన్నారు. కాని... నేనాయన్ని చూసి ఏడాది దాటిందనుకుంటాను., నేను పాడే కొన్ని పాటలు ఆయనకు నచ్చవు, శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాననుకోండి. అదే తప్ప పాడనంటే నా మొహం యెవరు చూస్తారు చెప్పండి? శాస్త్రీయ సంగీతం పాడటంలో నేను ఎమ్మెస్‌నూ, ఎమ్మెల్‌నూ పోల్తానా? ప్రొడ్యూసర్లకు కొత్త కావాలి, ఏమంటారు?"

❁ ❁ ❁ ❁ ❁

ఆకుపచ్చ రంగు వేసిన మారిస్ మైనర్ కారులో నలుగురు యువకులు వి.జి.పి. రోడ్ వెంట మహాబలిపురం వెడుతున్నారు.

"వెధవది, ఈ దూర ప్రయాణాలకు కారు యెంత పూటుగా వుంటే ప్రయాణం అంత సుఖంగా ఉంటుంది. మావంటి దర్భపుల్లలు నాలుగన్నా వుండందే యీ ఎనక సీటు నిండిచావదేమో, వెధవది, ఆ సీతారామారావు యెగేశాడు. అతను కూడా వస్తే మేం గంగాళాలు ఉద్ధరిణెల్లా అవటం తప్పేది" అన్నాడు వెనక సీటులో నుంచి జగన్నాథం.

"వెధవది, వెధవది అంటూ బయల్దేరినప్పట్నుంచి సలుపుతున్నావేమిటోయ్?" అన్నాడు స్టీరింగు దగ్గర నుంచి రాజా.

"సీతారామారావు యెందుకు రాలేదుటా?" అని రాజా పక్కన ఫ్రంటు సీటులో కూచున్న స్వామి అడిగాడు.

"ఈ సాయంకాలంలోపల నవల పూర్తిచేసి పబ్లిషర్ కివ్వాలట" అన్నాడు రాజా.

"అత నీ మధ్య యేమీ రాయటం లేదేమోగా?" అన్నాడు స్వామి.

"ఏమీ రాయటంలేదూ? ఇంకా నయం. గడచిన ఆరు మాసాల్లో పదహారు నవలలు రాశాడు."

స్వామి రాజుకేసి తేరిపార జూసి అతను అబద్ధం ఆడటంలేదని, అతని మాట నమ్మవచ్చుననీ నిశ్చయించుకుని, "నాకు తెలీదు సుమా! దాదాపు అతను రాసిందంతా చదివాను. నన్నడిగితే అతనికి రాతగినంత పేరు రాలేదంటాను. చాలా బాగా రాస్తాడు. ఏవేవో భావాలు తెచ్చి పోగులు పెట్టేవాళ్ళూ, దండలు గుచ్చేవాళ్ళూ చాలామంది ఉన్నారు. అతను అందరికీ తెలిసిన భావాలనే తెచ్చి చిత్రంగా పాకం పట్టేస్తాడు.... కెమికల్ రియాక్షన్లు తెప్పిస్తాడు... అతని 'వెయ్యి కళ్ళు' చదివేశావుగాదూ?..."

"ఇప్పుడతను అటువంటి నవలలు రాయటం లేదు. ఈ రాసేవాటిని నువు చదవక్కరలేదు. అవి అతని పేరుతోకూడా రావటంలేదు..." అన్నాడు రాజు.

❀ ❀ ❀ ❀ ❀

పబ్లిషరు గారి మేడ పై అంతస్థులో దక్షిణపు వేపు వరండాలో బల్లముందు కూచుని బరబరా రాసేస్తున్న సీతారామారావు ఆఖరు పంక్తి కింద ఒక అడ్డుగీత గీకేసి, కుర్చీలో వెనక్కు వాలి కూర్చున్నాడు.

మరో డిటెక్టివ్ నవల పూర్తి అయింది. ఇందులో విశేషం యేమిటంటే "హత్య కాబడినవాడుగా అందరూ అనుకున్నవాడే హంతకుడు. హంతకుడుగా అనుమానించ బడినవాడే శవం. సీతారామారావు బెల్ కొట్టినట్టుగా వెనుక గదిలో నుంచి లత వచ్చింది. రంగు చామనఛాయ కన్న కూడా తక్కువేగాని, మనిషి ఆకర్షవంతంగా ఉంటుంది. ప్రబంధ స్త్రీల వర్ణన ఆమెకు సరిపోతుంది. బరువైన రొమ్మూ, పిరుదులూ, మధ్యను సన్నని నడుము, ముఖంలో అందమూ లేదు. అనాకారితనమూ లేదు. సంసార పక్షం మొహం.

లత, సీతారామారావును సమీపించి స్వతంత్రంగా అతని ఒళ్లో కూచుని, బల్లమీది కాగితాలు బొత్తి పెట్టేసింది. వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకోబోతున్నారు. లత అతని ఫస్ట్ ఫాన్ – బెస్ట్ ఫాన్. ఆమె అతను రాసిన ప్రతి డిటెక్టివ్ నవలా చదివింది. మూడో పుస్తకం దగ్గిర నుంచీ అతనిరేటు రెట్టింపు చేయించింది.

ఆమె తండ్రిది విచిత్రమైన జాతకం. ఆయన ఒక ప్రెస్సువాడికి అప్పు పెట్టి ప్రెస్సు

నష్టపోగా తన బాకీకింద ప్రెస్సు తీసేసుకున్నాడు. అది ఎట్లా వదిలించుకోవటమా అని చూస్తూండగా ఎవరో డిటెక్టివు నవలలు అచ్చువెయ్యమని సలహా యిచ్చారు.

దాంతో ఆయనకు సిరి ఎత్తుకున్నది, ఈ మేడ కొనేశాడు. ఇంకా డబ్బు వచ్చి పడుతూనే ఉన్నది.

లత ఆయనకు ఒకతే కూతురు.

సీతారామారావును చూడటానికి ఆమె తహ తహలాడిపోయింది. అతను ఆమె ప్రాణానికి స్టార్. అతన్ని చూసి క్షణంలో ఆమె అభిమానం ప్రేమగా మారింది, సీతారామారావు అందమైనవాడు.

లత అతను రాసిన 'వెయ్యికళ్ళు' చదవలేదు. అటువంటి పేరుగల నవల అతను రాసినట్టు కూడా ఆమె ఎరగదు.

లత అతని ఒళ్లో నుంచి లేచి గదిలోకి వెళ్ళి తన రిస్టు వాచీలో టైము చూసుకొని సిలోన్ రేడియోలో తెలుగు రికార్డులు పెట్టి కాఫీ, టిఫిను తీసుకురావటానికి కిందికి దిగి వెళ్ళింది.

కుర్చీలో చేరగిలబడి కూర్చుని వున్న సీతారామారావు ఉలికిపడి లేచాడు. గానకళ పాడిన పాటను రేడియోలో ఎనౌన్స్ చేశారు.

సీతారామారావు చివాలున లేచి గదిలోకి వెళ్ళి నిట్టూర్పు విడిచాడు.

❀ ❀ ❀ ❀ ❀

గానకళను ఇంటి దగ్గిర దింపేసి ప్రొడ్యూసర్ కారు వెళ్ళిపోయింది.

ఆమె మనస్సు చాలా కలవర పడింది. ఆరోజు రిహార్స్ చేసిన పాట డ్యూయెట్. రెండో మనిషి కూడా ఆడదే. పిక్చర్లో యిద్దరు హీరోయిన్లున్నారు. ఒకతె వాంప్, రెండవది పతివ్రత. పాటలో ఈ తేడా తెలియటానికిగాను వాంప్‌కు గానకళ పాడింది. కర్ణాటక బాణీలో ఇంకో ఆవిడ పాడింది.

రెండో మనిషి పాడుతూంటే గానకళ "ఒకప్పుడు నేనింతకన్న బాగా పాడేదాన్ని" అనుకున్నది.

ఆ బిట్ తనకివ్వమని అడిగికూడా ప్రయోజనం లేదు. తన బిట్ రెండో ఆవిడ పాడలేదు.

ఆమె భోజనం చేసి పడుకున్నా తన మనసులో బరువు దిగిపోలేదు.

"ఇదిగోనమ్మా పత్రికా."

సినిమా పత్రిక. అందులో తనను గురించి రాశారు. ఫొటోలు వేశారు. ఫొటోలో

తను మరీ ఘోరంగా ఉన్నది. రాసినదంతా చదివింది. చదువుతున్న కొద్దీ మనసు తేలిక అయింది.

చిట్టచివరను సీతారామారావు పేరు కనిపించగానే పోయిన దిగులంతా తిరిగివచ్చింది.

ఆమె కళ్ళముందునుంచి పత్రికపోయి సీతారామారావు ముఖం వచ్చి నిలిచింది. ఎంత అందమైనవాడతను.

అతను తనకన్న రెండేళ్ళు కాబోలు పెద్దవాడు. ఎదురెదురు ఇళ్ళు, చిన్నప్పటినుంచీ స్నేహం. తమకిప్పుడు లేదుగాని, ఒకప్పుడు బాగా ఉన్నవాళ్ళే. అంతా పోయింది. తాను సంగీతం మేష్టరుకు డబ్బివ్వలేక సంగీతం మానుకుంటే చాలా బాధపడ్డాడు.

తాను ఒక మనిషి జీవితాన్ని తారుమారు చేసిందంటే యెవరూ నమ్మరు. కాని సీతారామారావు జీవితం తారుమారైపోవటానికి తానే కారణమని గానకళకు దాదాపు రూఢిగానే తెలుసును.

తనకా పెళ్ళి సంబంధం స్థిరమయ్యేదాకా అతను మామూలు మనిషిలాగే వున్నాడు. ఆ తరువాత అతను వెర్రెత్తిన వాడిలాగ అయిపోయాడు.

"శేషూ, ఈ పెళ్ళి చేసుకోకు. వెనకటి రోజులుకావు. సంగీతం ప్రాక్టీసు చెయ్యి. మంచి భవిష్యత్తుంటుంది. రేడియోలో పాడు. పాటకచ్చేరీలు చెయ్యి. ఆ త్రాష్టుణ్ణి పెళ్ళి చేసుకుని వాడికి పిల్లల్ని కని, వాడి దరిద్రం పంచుకుని ముసలి దానవైపోతావా? నీరక్తం తిరగబడటంలేదా?" అన్నాడతను తనతో.

తనకు తల్లిదండ్రులు పెట్టుకున్న పేరు శేషమ్మ – తన నాయనమ్మ పేరు.

"మా నాన్న కట్నం యివ్వలేడు. నా అందం నీకు తెలుసు. నాకు మంచి సంబంధం యెట్లావస్తుంది? అన్నది తను.

"పెళ్ళి చేసుకోకు. కొంప కూలిపోదు. కావలిస్తే నేనూ మానేస్తాను అంతగా కొంప కూలేటట్టుంటే నేనే నిన్ను పెళ్ళాడతాను శేషూ."

"నువ్వా?" అన్నది తను నమ్మలేకుండా.

"అవును, శేషూ నీలోమాత్రం అందంలేదా? అది నీ గొంతులో వుంది, అందరూ కళ్ళతోటే ఆనందం పొందాలా? నేను చెవులతో ఆనందం పొందుతాను... అది ముఖ్యంకాదు. ముఖ్యమైన విషయం నువ్వు పాటగత్తెవు కావటం."

"నన్నెవరు పాటగత్తెను చేస్తారు?"

"నేను చేస్తాను."

"నువ్వా?"

"ప్రతిదానికీ 'నువ్వా' అనకు. నీ బరువు నామీద వెయ్యటానికి ఒప్పుకుంటే నేను మొయ్యటానికి సిద్ధంగా ఉన్నాను."

తగినంత ప్రేరణ లోపలినించీ రావాలేగానీ మనుషులు ఏదైనా చేస్తారు.

సీతారామారావు తన అన్నతో భాగాలు పడ్డాడు. తన ఆస్తి తెగనమ్మేశాడు. తరవాత ఒక అర్ధరాత్రి మెయిలులో పడి అతనూ తానూ పట్నం వచ్చేరు.

లజ్ దగ్గిర కెనెడీ సందులో ఇద్దరూ కాపరం పెట్టారు. అవును కాపరమే. తాను రోజూ సంగీతం నేర్చుకునేది.

అతను రెండు నెలలపాటు ఇల్లు కదలకుండా కూచొని తన మొదటి నవల రాశాడు. దాని సాహిత్య విలువ ఆమెకు తెలీదు. అయినా అతనికి సంబంధించినదేదైనా ఆమెకు ప్రేమాస్పదంగానే వుండేది.

"చాలా బాగుంది, భలే బాగుంది. దీన్ని ఏం చేస్తావు?" అని ఆమె అడిగింది.

"ఇదే బాగుందంటున్నావా? ఇంకా మంచిది రాస్తాను చూడు" అన్నాడు.

రెండు నెలల తరవాత అతను ఒక సాహిత్య పత్రికలో వుద్యోగం సంపాదించాడు.

ఆ వుద్యోగం ఎందుకోగాని ఇద్దరి జీవితాలలోనూ కుళ్ళు ప్రవేశపెట్టింది.

సీతారామారావుకు సాహిత్యం గురించి స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. అతను సాహిత్యాన్ని రక్తంతో పోల్చేవాడు. అది సమాజానికి బలాన్ని చేకూర్చే భావాలను అందిస్తూ మాలిన్యాన్ని కడిగేసుకుంటూ పోతుంది. అలాగే రచయితలను కూడా అతను ఎర్రకణాల కిందా, తెల్లకణాల కిందా విభజించాడు. వీరేశలింగం వంటివాళ్ళు తెల్ల జీవకణాలు, సంఘంలో రుగ్మత జాస్తిగా వున్నప్పుడు ఈ రకం రచయితలు పుట్టుకొచ్చి రోగాన్ని ఎదుర్కొంటారు. సంఘాన్ని పోషించే రచయితలు ఎర్ర కణాల్లాటి వాళ్ళు. కృష్ణదేవరాయల నాడు ఎర్రకణాల వంటి కవులు జాస్తి.

వినేవాళ్ళుంటే సీతారామారావు సాహిత్యం గురించి ఎంతైనా చెప్పేవాడు. కాని అతని నరాలలో ప్రవహించుతూ వచ్చినది మాత్రం సంగీతం. సంగీతం గురించి అతను మాట్లాడేవాడుకాడు.

పత్రికాధిపతికి నిజంగా సాహిత్యాభిలాష లేదనీ, పేరుగల రచయితలందరిపైనా ఆ పెద్దమనిషికి ఏదో కసిలాటి భావం ఉందనీ, తనకు మొదటగా అనుమానం కలిగినప్పుడు సీతారామారావు ఆశ్చర్యపోయాడు. కాని తాను అనుకున్నదానిలో అపోహ ఏమీ లేదని త్వరలోనే రుజువయింది. ఈ సాహిత్య పత్రిక సాహిత్యానికి గర్భశత్రువు.

ఈ సంగతి తెలిసినాక కూడా సీతారామారావు ఆరు మాసాలు అందులో పని చేశాడు. మనుషుల అసహాయత ఎప్పుడు ఏ విధంగా బయటపడేదీ చెప్పలేం.

సీతారామారావుకు వుద్యోగం దొరికినప్పటినుంచీ శేషలో మార్పువచ్చింది. ఆమెకు సంగీతం నేర్చుకుని పాట కచ్చేరీలు చెయ్యాలన్న కోరిక అవాస్తవమైనదిగా తోచింది. అనుక్షణమూ అతడు తనపై కురిపించే ప్రేమ ఆమెలోని స్త్రీత్వాన్ని, మాతృత్వాన్ని ప్రకోపింపచేసినట్టయింది.

"ఈ పాడు సంగీతం నాకింక వద్దు. మనకిప్పుడేం తక్కువయింది?" అన్నదామె అతనితో ఒకసారి.

సీతారామారావు కొయ్యబారి పోయినాడు. అతని మొహం జేవురించింది. అతనిలో అంత కోపమూ, అసహ్యమూ శేష యెన్నడూ చూసి వుండలేదు. తాను యేమి ఘోరమైన మాట అన్నదో ఆమెకు తెలియలేదు.

"ఏమిటి నీ ఉద్దేశం? నీకు మొగుణ్ణయి నీ జీవిత సమస్య పరిష్కరించటానికేనా నేను మా అన్నయ్యతో భాగాలుపడి, ఉన్నదంతా అమ్ముకుని, ఇక్కడికి వచ్చి, ఆ వెధవ పత్రికలో పనిచేసి మానాభిమానాలన్నీ మంట గలుపుతున్నది?

నాకు కావలసింది పెళ్లామే అయితే నీకన్న మంచిదాన్ని సంపాదించుకోలేక పోయినాననా నీ ఉద్దేశం?....."

అతని మాటలు శేషకు అర్థం కాలేదు. కాకుండానే బావురుమని యేడిచేసింది. నిష్కారణంగా తల్లిచేత చావుదెబ్బలు తిన్న పిల్లాడు కూడా అంతకంటె జాలిగా ఏడవడు.

సీతారామారావే ఆమెను సముదాయించాడు. పత్రికాధిపతి పైన రగిలే కోపం కట్టలు తెంచుకుని శేషపైకి మళ్ళింది.

"సంగీతం మానటం నీ కిష్టంలేకపోతే ఆ మాట చెప్పరాదా? ఇన్ని తిట్లు తిట్టాలా?" అన్నది శేష యెక్కిళ్ళతో.

"ఔను, శేషా! నువు సంగీతం మానేస్తే నిన్ను వదిలేస్తాను. ఇంక యెప్పుడూ ఆ మాట అనకు! నేను నిన్నింక కోప్పడన్లే!" అన్నాడు సీతారామారావు.

అతను ఉద్యోగం మానేసి యింట్లో కూర్చుని "వెయ్యి కళ్ళు" రాశాడు. దాన్ని ఒక వారపత్రిక సీరియల్‌గా ప్రచురించింది. దానివల్ల అతనికి వచ్చిన డబ్బు కొంచెమే గాని, కీర్తి జాస్తి.

❁ ❁ ❁ ❁ ❁

ఇంజనీరింగు కాలేజీవాళ్ళు సాంస్కృతిక సభలు జరిపారు. ఆహ్వానం మీద సీతారామారావు, లత పబ్లిషరుగారి కారులో బైలుదేరారు.

ఆ రోజే అతను సినిమా పత్రికలో గానకళ గురించి చూశాడు. అతను చూశాడనడంకంటె లత చూపించిందంటే సరిగా ఉంటుంది.

"అంత బాగా పాడుతుంది. మనిషి యెంత అసహ్యమో!" అన్నది లత.

"ఊ!" అన్నాడు సీతారామారావు పత్రిక చదవటంలో మునిగిపోయి.

"సినిమా ఫీల్డులో చేరటానికి నేనేమీ శ్రమపడలేదు" అని శేషు అన్నదిట! తన అదృష్టమని కూడా అన్నదిట!

ఔను! శ్రమ పడింది తనూ!

కారులో పోతూ అతడు శేషు కోసం తాను పడిన శ్రమలన్నీ జ్ఞాపకం తెచ్చుకున్నాడు.

అతను ఉద్యోగం మానుకున్న తరవాత డబ్బు యిబ్బంది చాలా హెచ్చింది. ధరలు పెరిగిపోతున్నాయి. ఇంటివాడు అద్దె యెక్కువిమ్మన్నాడు.

అతను ఆ యిల్లు వదిలేసి తేనాంపేట సందులో ఒక దిక్కుమాలిన భాగం సంపాదించాడు. దాని అద్దె కూడా రాను రాను దుర్లభమైంది.

మద్రాసు అంతటా మురికిపేటలుండేవి. ఎక్కడ ఖాళీ దొరికితే అక్కడల్లా పేదవాళ్ళు పాకలు వేసుకుని, వాటి ముందూ వెనకా అవిసిచెట్లు, గంటపూల లతలు వేసుకుని పాకలపైకి సొరపాదులూ అవీ యెక్కించుకుని తమకు చాతనైనంత సుఖంగా జీవిస్తూ, అధికార్లు గొంతుపైన కూచున్నప్పుడు, అక్కడి నుంచి వెళ్ళిపోయి యింకో చోట మురికిపేట నిర్మించుకునేవారు.

సీతారామారావు యీ మురికిపేటల వాళ్ళను చూసి అసూయపడే దశ కూడా వచ్చింది. ఏ మురికిపేటలోనో తాను కూడా ఒక గుడిసె వేసుకుని దాని వెనక నాలుగు అరటి పిలకలు నాటాలన్న ప్రేరణ అతనికి ఎన్నిసార్లు, ఎంత బలంగా కలిగిందో!

ఒకనాడు అతను నిర్ధారణ చేసుకున్నాడు. ఇక తమ యిద్దరినీ కొంతకాలంపాటు శేషు పోషించవచ్చు. ఆమెపాటి పాడగలవాళ్ళు సినిమాలలో పాడుతున్నారు. రేడియోలో పాడుతున్నారు.

అతను కాళ్ళకు బలపాలు కట్టుకుని సినిమా ప్రొడ్యూసర్ల చుట్టూ తిరిగాడు. అందరూ తలా ఒకటీ చెప్పారు. కొత్తవాళ్ళకు అవకాశాలు దొరకటం కష్టం... నేర్చుకున్న సంగీతం సినిమాకు పనికిరాదు.... కొన్ని గొంతులు వినటానికి బాగుంటాయి గాని, రికార్డు చేస్తే ఘోరంగా వుంటాయి.... కోరస్‌లో పాడగా పాడగా సోలో ఛాన్సు వస్తుంది....

ఏదో బలమైన ప్రవాహంలో కొట్టుకుపోతూ తన యిచ్ఛానుసారం కాలూ, చెయ్యీ ఆడించే శక్తి పోగొట్టుకున్న వాడిలాగా అయిపోయాడు, సీతారామారావు. నిజమే అలాటి బలవత్తరమైన అదృశ్య ప్రవాహాలు, సుడిగుండాలు గల చోట వచ్చిపడ్డాడు అతను.

రేడియోవాళ్లు ఎక్కువ కనికరం చూపారు. శేషు ఒకనాడు సీతారామారావు వెంట రేడియో స్టేషనుకు వెళ్ళి ఆడిషన్ ఇచ్చింది. ఆ తరవాత ఒక నెలకు ఆమెకు పాటల నాటకంలో ఛాన్సు దొరికింది.

కాని ఈ ఛాన్సులు ఎప్పుడోగాని రావు. సీతారామారావు సినిమావాళ్ళను వదిలిపెట్టలేదు.

'శేషు అందమైన మనిషి అయివుంటే సులువుగా ఛాన్సు దొరికేదేమో!" అనుకుని అతను సినిమా వాళ్ళపైన తన కసి వెళ్ళగక్కుకున్నాడు.

శేషుకు మొదటి ఛాన్సు ఇచ్చిన మ్యూజిక్ డైరెక్టర్, ఆమెను సినిమా పాటలు కొన్ని ప్రాక్టీసు చెయ్యమని చెప్పాడు. తన మొదటి సంపాదనతో ఆమె ఆక్షనులో ఒక సెకండ్ హేండ్ గ్రామఫోనూ, కొన్ని సినిమా రికార్డులూ, ఒక పిన్నుల డబ్బీ కొన్నది.

మొదటి సంవత్సరం శేషు మూడు వేలు సంపాదించుకున్నది. ఆమె దృక్పథంలో చాలా మార్పు వచ్చింది. ఆమె తన తల్లిదండ్రులకు వుత్తరాలు రాసింది. వాళ్లు జవాబు రాశారు.

ఒకనాడు వాళ్ళిద్దరూ బయలుదేరి వచ్చేశారు. వాళ్లు వచ్చిన ఒక పావుగంటలో సీతారామారావు ఆ యిల్లు వదిలిపెట్టాడు.

తరవాత ఒక ఏడాదిపాటు అతను డబ్బు కావలసివచ్చినప్పుడల్లా వచ్చేవాడు. అతను పది అడిగితే శేషు పాతిక ఇచ్చేది. ఆమె తప్పు లేదు. అతన్ని పెళ్ళి చేసుకుంటానన్నది. అతన్ని తన ఇంట వుండమన్నది.

"నీ బరువు నువు మోసుకోగలస్థితికి వచ్చావు. నా బరువు కూడా దేనికి మోస్తావు?" అన్నాడతను.

"ఇప్పుడు మొయ్యటం లేదా" అన్నదామె నవ్వుతూ.

అతను మళ్ళీ ఆమెకు కనిపించలేదు.

❀ ❀ ❀ ❀ ❀

ఇంజనీరింగ్ కాలేజీకి వెళ్ళినాక సీతారామారావుకు ఆనాడు గానకళ పాడుతున్నట్టు తెలిసింది.

లత చాలా సంతోషించింది.

"నాకా గానకళ పాట అంత బాగుండదు" అన్నాడతను.

శేషు ఠీవిగా వచ్చి వేదికపైన కూచున్నది. తెల్లటి బట్టలు కట్టుకుని మల్లె పువ్వులాగా వున్నది. చేతి రుమాలు చాలా చిన్ని వుండగా చుట్టి దానితో మాటి మాటికీ మూతి చుట్టూ తుడుచుకుంటున్నది. తబలా, హార్మోనియం, క్లారినెట్టూ, ఓ వయొలిన్, మొరాకోస్ పక్క వాద్యాలు.

వాద్యాలు శ్రుతి చేసుకునే సమయంలో శేషు ఒక పక్కకు వంగి హార్మోనిస్టుతో యేదో చెప్పింది. వాద్య బృందం హంసధ్వని స్వరాలు మోగించింది. శేషు "వాతాపి గణపతిం భజే" ప్రారంభించింది.

సీతారామారావు నిర్ఘాంతపోయాడు. లత నిరాశతో అతని పక్కన మూలిగింది.

శేషు యీ పాట యెందుకు పాడాలి? తనను చూసిందా! తనకింకా కర్ణాటకం వచ్చునని చూపిస్తుందా? శేషు పాడుతుంటే కృతి కూడా సినిమా పాటల్లేనే వుంది. తబలావాడు త్రితాల్ దరువు వేస్తున్నాడు.

శేషు పెద్ద పెద్ద సంగతులు వేస్తున్నది, ఘోరంగా ఉన్నాయి అవి.

ప్రేక్షకులు కిల కిలలాడటం మొదలుపెట్టారు.

సీతారామారావుకు శేషుపైన జాలి వేసింది. లేచి, "ఆపు శేషూ!" అని కేక పెడదామనుకున్నాడు. అంతా అతనికి పీడకలలాగా ఉంది.

తనకు లత వద్దు, ఆమె డబ్బు వద్దు, శేషును తీసుకుని వెళ్ళి ఏ గుడిసెలోనో పెట్టి రోజూ కర్ణాటకం సాధనచేయించి, ఈ అన్నామలై హాలులో ఆమెను పాట కచ్చేరీ చేయించాలి తను! అప్పుడుగాని ఈ పీడకల కరిగిపోదు...

అందరూ చప్పట్లు కొట్టారు. శేషు ఎప్పుడో వాతాపి పూర్తిచేసి సినిమా పాట ఎత్తుకున్నది. ఆ జర్నలిస్టు అవాచ్యమైన పేరు పెట్టిన జాతికి చెందిన పాట. ఆ పాట పాడటానికి పాడే మనిషి ఎక్కడికక్కడ తన ఊపిరి పోతున్నట్టూ తనను యెవరో వెనకనించి తోస్తున్నట్టూ పాడాలి...

వినేవాళ్ళ ఆనందానికి మేరలేదు. లత సంతోషం పట్టలేకుండా ఉంది. పెద్ద మల్ల యుద్ధం చేసినట్టుగా సీతారామారావు నిలువునా నీరసించి తేలికగా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు సాగించాడు.

చీకట్లో పడి యింటికి తిరిగి వచ్చి భోజనం చేసి సీతారామారావు మేడపైకి వెళ్ళాడు. వరండాలో చల్లని గాలి వీస్తున్నది. ఆకాశాన నక్షత్రాలు కాంతివంతంగా ప్రకాశిస్తున్నాయి.

లత వచ్చి అతని పక్కనే నిలబడింది.

సీతారామారావు ఆమె నడుముచుట్టూ చెయ్యివేసి, "నీకు నడుములో ఇంత అందం ఎట్లా పెట్టాడు దేవుడు?" అన్నాడు.

"ఒక్కొక్కరికి ఒక్కొక్కరకం అందం పెడతాడు దేవుడు" అన్నది లత ఉదాత్తంగా.

"కాని అన్నింటికంటే అందమైనది డబ్బు లతా. పోతే డబ్బుపోతుంది గాని, దానిలో ఉండే అందంమటుకు పోదు. మిగిలిన అందాలు అట్లా కాదు" అన్నాడు సీతారామారావు.

"అంటే?" అన్నది లత అయోమయంగా.

అతను పలకలేదు. అతని ముఖంలో ఉండే భావం ఏమిటో చీకటిలో లతకు తెలియరాలేదు.

*ముద్రణ: నవగ్రహకూటం, కథల సంపుటి, 1966-68 మధ్య?*

*జనతా ప్రచురణాలయం, విజయవాడ*